
## రెండోరోజూ 'సిట్' విచారణ

బెంగళూరు, జూలై 27(ఆంధ్రజ్యోతి): దక్షిణకన్నడ జిల్లా ధర్మస్థళలో మృతదేహాల అంశంపై సిట్ విచారణ రెండోరోజూ కొనసాగింది. శనివారం 11 గంటలనుంచి రాత్రి 7 దాకా విచారణ జరిపారు. ఆదివారం ఉదయం నుంచి రాత్రి దాకా ఫిర్యాదిదారుడి నుంచి పలు కోణాలలో సమాచారం సేకరించారు. సిట్ ముఖ్య అధికారి ప్రణవ్ మహంతి, అనుచేత్ విచారణ సాగించారు. కాగా ఫిర్యాదిదారుడితోపాటు అతడి తరఫు న్యాయవాదికి భద్రత కల్పించాలనే డిమాండ్ పెరిగింది. సిట్ కార్యాలయం నుంచి వారిని బయటకు తీసుకెళ్లారు. మృతదేహాల గుర్తింపు ప్రక్రియ ఎప్పుడన్న దానిపై ఉత్కంఠ రేగుతోంది.




- రాష్ట్రంలో క్వాంటమ్ పరుగులు
- 31న దేశంలోనే తొలి క్వాంటమ్ సమ్మేళనం
- విజయవంతం కోసం ప్రత్యేక టాస్క్‌ఫోర్స్
- ఆంధ్రప్రదేశ్‌తో పోటీ పడేందుకే..



మైక్రోసాఫ్ట్ విడుదల చేసిన తొలి క్వాంటమ్ చిప్

# దూసుకెళ్దాం..!

బెంగళూరు, జూలై27(ఆంధ్రజ్యోతి): ఐటీ, బీటీ, నానో, వైమానిక, అంతరిక్ష విభాగాల పరిశోధనలు, అభివృద్ధిలో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంలో కర్ణాటక రాజధాని బెంగళూరు విశ్వవ్యాప్తంగా పేరొందుతోంది. క్వాంటమ్ కంప్యూటర్ రంగంలోనూ దేశాన్ని ముందుకు తీసుకెళ్లే ఛాంపియన్ అయ్యేందుకు అడుగులు ముందుకు వేస్తోంది. ఇదే సందర్భంలోనే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కూడా క్వాంటమ్ కంప్యూటింగ్ రంగంలో విజయం కోసం తీవ్రస్థాయిలో కసరత్తు చేస్తోంది. ఈ అవకాశాన్ని దక్కించుకునేందుకు కర్ణాటక పోటీ పడుతోంది.

విద్య, ఆరోగ్య సేవా విభాగంలోని పలు రంగాలలో మహత్తరమైన మార్పులు సంస్కరణలకు కారణంగా సాంకేతికతకు సంబంధించి దేశంలోనే తొలిసారి బెంగళూరులో రెండు రోజుల క్వాంటమ్ సమ్మేళనం జరిపేందుకు నిర్ణయించారు. ఈనెల 31, ఆగస్టు 1న సమ్మేళనం జరిపేందుకు శాస్త్ర, సాంకేతిక రంగాలశాఖ మంత్రి ఎన్ఎస్ బోసరాజు నిరంతరంగా సమీక్షలు జరుపుతున్నారు. ఇప్పటికే ఓ రోడ్‌మ్యాప్‌ను సంసిద్ధం చేశారు. నోబెల్ పురస్కార గ్రహీతలతోపాటు క్వాంటమ్ రంగంలో ముందంజలో ఉన్న దేశ విదేశీ ప్రతినిధులనూ ఇందులో భాగస్వాములను చేస్తున్నారు. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్సెస్ (ఐఐఎస్‌సీ)లో క్వాంటమ్ రీసెర్చ్ పార్క్‌ను స్థాపించారు. బెంగళూరుకు చెందిన క్యూపీఏఐ సంస్థ దేశీయంగా నిర్మిస్తున్న 25 క్యూబిక్ కంప్యూటర్ క్వాంటమ్ ఇండస్ సేవలనును అందిస్తోంది. క్వాంటమ్ ఆధునికతలో దేశానికే మార్గదర్శకం చేయనుంది. ఈ విభాగానికి చెందిన పరిశ్రమల ఆకర్షణ, పరిశోధనలకు ప్రాధాన్యం ఇచ్చేలా సమ్మేళనం జరపాలని నిర్ణయించారు. క్వాంటమ్ రంగంలో అవకాశాలను సద్వినియోగం చేసుకునేందుకు నిపుణులచే టాస్క్‌ఫోర్స్ ఏర్పాటుకు ప్రభుత్వం తీర్మానించింది.

ప్రస్తుతం క్వాంటమ్ కంప్యూటింగ్ రంగంలోనూ రెండు రాష్ట్రాల మధ్య పోటీతత్వం నెలకొంటోంది. క్యూపీఏఐ ఫౌండర్ నాగేంద్ర నాగరాజన్‌తో భేటీ అయినటువంటి ఓ ఫోటోను షేర్ చేసిన ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు ఇటీవల రాజధాని అమరావతి క్వాంటమ్ వ్యాలీగా రూపుదిద్దుకుంటోందని ఎక్స్‌లో పోస్ట్ చేశారు. ఇదే తరుణంలోనే బెంగళూరుకు అనుబంధంగా అంతర్జాతీయ విమానాశ్రయం కల్గిన దేవనహళ్ళి సమీపంలో హైటెక్ డిఫెన్స్ అండ్ ఏరోస్పేస్ పార్క్ ఏర్పాటుకు రాష్ట్రప్రభుత్వం భూస్వాధీన ప్రక్రియ చేపట్టింది. అక్కడి రైతులు దశాబ్దాలకాలంగా వ్యవసాయంపై ఆధారపడ్డామని, పరిశ్రమలకోసం సాగుభూములు ఇస్తే వారి కుటుంబాలు జీవనం దుర్భరం కానుందని ఏకంగా 1100 రోజులకుపైగా నిరసన తెలిపారు. ఇది జాతీయస్థాయిలో చర్చకు కారణమైంది. భారతీయ కిసాన్‌సంఘ్ ముఖ్యులు కూడా ఇక్కడి రైతులకు మద్దతు ఇచ్చారు. అన్ని విధాలా ఒత్తిడి రావడంతో ప్రభుత్వం పదిరోజులక్రితం రైతుల భూములను స్వాధీనం చేసుకునేది లేదని తేల్చి చెప్పారు. దేవనహళ్ళి పరిధిలో భూస్వాధీన ప్రక్రియను రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. ఇదే సమయంలో ఏపీ ఐటీ మంత్రి నారా లోకేశ్ ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులు పెట్టేవారికి అన్ని సౌకర్యాలు కల్పిస్తామని, కోరుకున్న చోట భూములు కల్పిస్తామని చేసిన ట్వీట్ కర్ణాటక మంత్రులను కలవరపెట్టింది. ఆ వెంటనే రాష్ట్ర భారీ పరిశ్రమలశాఖ మంత్రి ఎంబీ పాటిల్ స్పందిస్తూ కర్ణాటక నుంచి ఒక్క పరిశ్రమ కూడా ఏ రాష్ట్రానికి వెళ్లేది లేదని, అటువంటి అవకాశం ఇవ్వబోమని ప్రకటించారు. మరో నాలుగు నెలల్లో ఆంధ్రప్రదేశ్‌లో క్వాంటమ్ కంప్యూటింగ్ సిద్ధం చేయాలని కసరత్తు సాగిస్తున్నారు. ఈలోగానే బెంగళూరులో భారీ సదస్సు ఏర్పాటు చేసి దేశంలోనే క్వాంటమ్ విభాగంలోనూ కర్ణాటక ముందంజలో ఉందని చాటి చెప్పనున్నారు. క్యూపీఏఐ దేశీయంగా నిర్మించిన క్వాంటమ్ కంప్యూటర్ ఇండస్ ఇప్పటికే కార్యాచరణ జరుపుతోంది. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్సెస్‌లో దేశంలోనే తొలి క్వాంటమ్ పరిశోధనా పార్కును ఏర్పాటు చేశారు. ఇందుకోసం రూ.48 కోట్లు ప్రభుత్వం సమకూర్చింది. సూపర్ కంప్యూటర్‌ను మీరి క్వాంటమ్ రంగంలో ప్రపంచంలోనే ప్రతిష్టాత్మకమైన సంస్థలకు బెంగళూరు దేశంలోనే కేంద్రబిందువుగా మార్చాలని నిర్ణయించారు.

## నాడు ఐటీబీటీలోనూ ఏపీతోనే పోటీ

గతంలో ఐటీబీటీ పరిశ్రమలను బలోపేతం చేసే దిశలో కర్ణాటక, ఆంధ్రప్రదేశ్‌ల మధ్య స్నేహపూర్వకమైన పోటీ జరిగింది. రెండున్నర దశాబ్దాలక్రిందట ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాజధాని హైదరాబాద్‌లో హైటెక్‌సిటీ ఏర్పాటుతోపాటు ఎన్నో దిగ్గజ కంపెనీలను ఆంధ్రప్రదేశ్‌కు తీసుకొచ్చిన ఘనత అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుదే. అదే కాలంలోనే రాష్ట్రంలో ముఖ్యమంత్రిగా కొనసాగిన ఎస్ఎం కృష్ణ దూరదృష్టితో ఐటీరంగాన్ని బలోపేతం చేసేందుకు ఎలక్ట్రానిక్ సిటీ ఏర్పాటు చేయించారు. ఇలా దేశంలో పొరుగురాష్ట్రాల్లో ఐటీబీటీ రంగాలు అభివృద్ధి చెందాయి. దేశంలోనే లక్షలాదిమందికి ఐటీఉద్యోగాలు వచ్చేందుకు వారిద్దరూ కారణమయ్యారు.



## క్వాంటమ్ టెక్నాలజీ అంటే..




క్యూపీఏఐ ఇండస్ విభాగం నమూనా

అత్యంత సూక్ష్మమైన కణాలు, వస్తువుల విశేష చర్యలను ఉపయోగించి కష్టతరమైన సాధ్యాలను సాకారం చేయడమే క్వాంటమ్ టెక్నాలజీ లక్ష్యం. ప్రస్తుతం మనం ఉపయోగిస్తున్న కంప్యూటర్ల కంటే అత్యధిక సామర్థ్యంతోపాటు విభిన్నమైన కార్యాచరణను క్వాంటమ్ కంప్యూటర్ సృష్టితో సాధ్యం కానుంది. క్వాంటమ్ కంప్యూటర్‌లు ప్రస్తుతం ప్రారంభదశలో ఉన్నా భవిష్యత్తులో కమ్యూనికేషన్, వైద్య, వస్తు విజ్ఞాన, సురక్షిత, కృత్రిమ మేధస్సుతోపాటు పలు రంగాలలో భారీగా మార్పులు వస్తాయని భావిస్తున్నారు. జాతీయ క్వాంటమ్ మిషన్ (ఎన్‌క్యూఎం)కు అనుబంధంగా దేశంలో ఈ రంగాల్లో ప్రగతి సాధించే లక్ష్యాన్ని పెట్టుకున్నాయి. ఈ విధంగా కార్యాచరణ చేస్తున్న రాష్ట్రాల్లో కర్ణాటక ముందంజలో ఉంది. క్వాంటమ్ కంప్యూటింగ్ అభివృద్ధి చేసే ప్రయత్నంలో కర్ణాటక విజయవంతమైందని ఇప్పటికే ప్రకటించుకుంది. రాష్ట్రంలో క్వాంటమ్ పార్క్ ఏర్పాటుతోపాటు అంతర్జాతీయ సమ్మేళనం నిర్వహిస్తున్న ఘనత రాష్ట్రానికే దక్కుతుందని అభిప్రాయపడుతున్నారు. క్వాంటమ్ కంప్యూటింగ్ విభాగంలో రెండు రాష్ట్రాలమధ్య పోటీ స్నేహపూర్వకంగా ఉంటుందనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. ఉపాధి అవకాశాలపై చర్చలు జోరందుకున్నాయి.



ఖర్గేకు జ్ఞాపికను అందజేస్తున్న మంత్రి ఎంబీ పాటిల్

## పదవుల కోసం పాకులాడలేదు

- ప్రజాదరణతోనే ఏఐసీసీ అధ్యక్షుడి స్థాయికి ఎదిగా: ఖర్గే

బెంగళూరు, జూలై27(ఆంధ్రజ్యోతి): పదవుల కోసం పాకులాడలేదని.. బ్లాక్ కాంగ్రెస్ నుంచి ఏఐసీసీ అధ్యక్ష పదవి దాకా ఎదిగానని మల్లికార్జున ఖర్గే అభిప్రాయపడ్డారు. విజయపురలో ఆదివారం జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ఖర్గే మాట్లాడుతూ అధికారం కావాలని ఎప్పుడూ పాకులాడలేదన్నారు. బాధ్యతాయుతమైన హోదాలు వాటికవే వచ్చాయన్నారు. సీఎల్పీ నేతగా కాంగ్రెస్ అధికారంలోకి వచ్చేందుకు శ్రమించానని కానీ అప్పుడు ఎస్ఎం కృష్ణ ముఖ్యమంత్రి అయ్యారన్నారు. తన కష్టం, సేవ నీటిలో కొట్టుకుపోయిందని అసంతృప్తి వ్యక్తం చేశారు. ఉపరాష్ట్రపతి రాజీనామా ఎందుకు చేశారో తెలియదని దాటవేశారు. ఉపరాష్ట్రపతి జగదీష్ ధన్‌ఖర్ ఎప్పుడూ ప్రభుత్వానికి అనుకూలంగా ఉన్నారని, హిందూ ముస్లింల అంశంపై మాట్లాడేందుకు తమకు అవకాశం ఇవ్వలేదన్నారు. ఏ కారణంతో రాజీనామా చేశారో తెలియదన్నారు. కాగా మల్లికార్జున ఖర్గే వ్యాఖ్యలతో రాష్ట్రంలో కొత్త నినాదం మరోసారి తెరపైకి వస్తోంది. దళిత సీఎం కావాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు. దళిత సీఎం అయితే పరమేశ్వర్‌కు అవకాశం రావాలని జగళూరు ఎమ్మెల్యే దేవేంద్రప్ప అభిప్రాయపడ్డారు. ఇటీవల రెండేళ్ల వ్యవధితోపాటు 2013-18 మధ్య కాలంలోనూ దళిత సీఎం ప్రస్తావన హల్‌చల్ చేసింది. ఇటీవలే నాయకత్వ మార్పు ఉంటుందని చర్చలు సాగిన సందర్భంలో మల్లికార్జున ఖర్గే రాష్ట్ర రాజకీయాల్లోకి వస్తారనే అంశం కూడా చర్చకు కారణమైంది. ఖర్గే 1978లో కలబురగి జిల్లా గురుమిట్కల్‌లో తొలిసారి ఎమ్మెల్యే అయ్యారు. అప్పటి నుంచి 11సార్లు ఎమ్మెల్యేగా విజయం సాధించారు. 2019 లోక్‌సభ ఎన్నికల్లో ఓటమి చెందారు. ఆ తర్వాత రాజ్యసభకు ఎన్నికయ్యారు. 2023లో కాంగ్రెస్ పార్టీకి అత్యధిక మెజారిటీ వచ్చినవేళ సీఎం పదవికి పోటీ కొనసాగుతున్న సందర్భంలో మల్లికార్జున ఖర్గే పేరు ప్రస్తావనకు వచ్చింది. సెప్టెంబరు క్రాంతి కలసి వచ్చేనా..? అనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. కార్యక్రమంలో మంత్రి ఎంబీ పాటిల్, బేలిమఠం శివానుభవ చరమూర్తి స్వామీజీ తదితరులు పాల్గొన్నారు.




# ముంచెత్తిన వాన

- తీర జిల్లాల్లో రెడ్ అలర్ట్
- 5 జిల్లాల్లో ఆరెంజ్ అలర్ట్
- కృష్ణానదికి వరదపోటు
- ఉధృతంగా తుంగభద్ర
- నిండుకుండల్లా జలాశయాలు

బెంగళూరు, జూలై 27(ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా వర్షాల ధాటి కొనసాగుతోంది. మరోవారం రోజులపాటు వర్షాలు కొనసాగనున్నాయని వాతావరణ పరిశోధనశాఖ హెచ్చరించింది. తీరప్రాంత జిల్లాలు ఉత్తరకన్నడ, దక్షిణకన్నడ, ఉడుపిలలో రెడ్ అలర్ట్ ప్రకటించారు. కొడగు, హాసన్, చిక్కమగళూరు, శివమొగ్గ, బెళగావి జిల్లాల్లో రానున్న ఐదు రోజులకు ఆరంజ్ అలర్ట్‌గాను, ధారవాడ, హావేరి, కలబురగి, బీదర్ జిల్లాలను ఎల్లో అలర్ట్‌గా ప్రకటించారు. మరో ఐదారు రోజులదాకా వర్షాలు కొనసాగుతాయని ప్రత్యేకించి తీరప్రాంత జిల్లాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. హొన్నావర ప్రాంతంలో 120 మి.మీ వర్షం నమోదైంది. చిక్కమగళూరు జిల్లాలోని ఐదు తాలూకాలలో విద్యాసంస్థలకు సెలవు కొనసాగిస్తున్నారు. దావణగెరె, శివమొగ్గ జిల్లాల్లో భారీ వర్షాలకు తుంగభద్ర నది పోటెత్తి ప్రవహిస్తోంది. తుంగ, భద్ర డ్యాంలకు అపారమైన వరదనీరు వచ్చింది. దావణగెరె జిల్లా హరిహర తాలూకాలో నీటిమట్టం పెరుగుతోంది. ఉక్కడగాత్రి దేవాలయం జలదిగ్బంధం అయ్యింది. రోడ్లు, బ్రిడ్జ్‌లు నీట మునిగాయి. నదీ పరీవాహకంలోని గణేశ ఆలయం మునిగిపోయింది.



శివమొగ్గలో వంతెన పైనుంచి పారుతున్న భద్రావతి



చిక్కమగళూరు జిల్లాలో తుంగానది ప్రవాహం


మహారాష్ట్రలో భారీ వర్షాల కారణంగా కోయ్నా, కాళమ్మవాడి ప్రాజెక్టులకు నీటి ప్రమాణం పెరిగింది. రాజ్‌పుర బ్యారేజ్ నుంచి 69వేల క్యూసెక్కులు, దూద్‌గంగా నది నుంచి 13వేల క్యూసెక్కులు విడుదల చేశారు. చిక్కోడి తాలూకా కళ్ళోల వద్ద కృష్ణనది 82వేల క్యూసెక్కులతో ప్రవహిస్తోంది. కోయ్నా జలాశయం 84శాతం భర్తీ కావడంతో ముందస్తు జాగ్రత్తలో భాగంగా 23వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. అంబోళి అటవీప్రాంతంలో భారీ వర్షాలు కురుస్తున్నందున ఘటప్రభ నదికి ఇన్‌ఫ్లో పెరిగింది. దీంతో హిడకల్ జలాశయానికి 17వేల క్యూసెక్కులు ఇన్‌ఫ్లో కాగా 12,900 క్యూసెక్కులు విడుదల చేశారు. పశ్చిమకనుమల ప్రాంతంలో మూడు నెలలుగా వర్షాలు కురుస్తున్నాయి. మంగళూరు జాతీయ రహదారి 169పై మట్టిచరియలు విరిగిపడ్డాయి. శృంగేరి శారదామఠం లోని తుంగానదిలో నీటి ప్రమాణం పెరిగింది. గాంధీ మైదానం పార్కింగ్ ప్రదేశంలోని దుకాణాలకు వరదనీరు చేరింది. పశ్చిమ కనుమలలో వర్షం ప్రభావంతో కావేరి జలాశయాలకు వరద పోటెత్తుతోంది. తలకావేరిలో 179.2 మిమీ వర్షం నమోదు కాగా భాగమండలలో 112 మిమీ వర్షం కురిసింది. కొడగు జిల్లా అల్లాడిలో 217మిమీ, బిరునానిలో 217 మిమీ వర్షం కురిసింది. హారంగలి జలాశయం నుంచి 25వేల క్యూసెక్కుల నీరు వదిలారు. కుశాల్‌నగర్, పెరియపట్టణ, కేఆర్‌నగర ప్రాంతాల వాసులను సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలన సూచించారు. కబిని నుంచి 40వేల క్యూసెక్కులు అవుట్‌ఫ్లోగా ఉంది. కేఆర్ఎస్ నుంచి 70వేల క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు. కేఆర్ఎస్‌లో మరో అడుగు మాత్రమే నిండాల్సి ఉన్నందున అవుట్‌ఫ్లో పెంచారు. హేమావతిలో 39వేలు క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. నీరు భారీగా విడుదల చేస్తున్నందున శ్రీరంగపట్టణంలో పిండప్రదానం కార్యక్రమాలను తాత్కాలికంగా నిలిపివేశారు. శివమొగ్గ జిల్లా భద్రావతి డ్యాం నుంచి 39వేల క్యూసెక్కులు విడుదల చేయగా ఆదివారం ఉదయం భద్రావతి సమీపంలోని కొత్త బ్రిడ్జ్ పైనుంచి నీరు ప్రవహించింది. భద్రావతిలోని కవలగుందిలో 15ఇళ్లలోకి నీరు చేరగా తాత్కాలికంగా పునరావాసకేంద్రాన్ని ఏర్పాటు చేశారు.



దావణగెరె జిల్లాలో జలదిగ్బంధంలో ఉక్కడగాయత్రి ఆలయం

# నిండా ముంచిన నకిలీలు

- 15 రోజులైనా మొలకెత్తని విత్తనాలు
- కన్నీరు మున్నీరవుతున్న అన్నదాత
- కంపెనీలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్



బళ్లారి, జూలై27(ఆంధ్రజ్యోతి): రైతులను నకిలీ కంపెనీలు మోసం చేస్తూనే ఉన్నాయి. అటు ఎరువులు, విత్తనాలు, రసాయనిక మందుల్లో నకిలీలతో అన్నదాత తరచూ నష్టపోతుంటారు. ఈ ఏడూ అదే జరిగింది. నకిలీ కేటుగాళ్లు రైతులను మోసం చేశారు. రైతుల అవసరాన్ని గుర్తించిన మోసగాళ్లు వారి జీవితాలతో ఆడుకున్నారు. సీజన్‌లో ప్రతి ఏటా నకిలీ విత్తనాలతో మోసపోయే రైతు ఈసారి కూడా అదే తప్పు చేశాడు. విత్తనం మొలకెత్తక రైతులు ఆవేదనకు గురవుతున్నారు. మరోసారి విత్తేందుకు భూమిలో తడిలేక కాలం గడిచిపోయిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒక పక్క ప్రకృతి, మరో పక్క తెగుళ్ల కారణంగా ఏటా నష్టాల బారిన పడుతున్న రైతులు ఇప్పుడు నకిలీ దెబ్బలతో విలవిలలాడుతున్నామని, తమ కష్టాలు ఏ దేవుడికి చెప్పుకోవాలోనని ఆందోళన చెందుతున్నారు. విజయనగర, బళ్లారి, జిల్లాలో ఖరీఫ్‌లో రైతులు వర్షాధారం, అలాగే బోర్ల కింద ఉన్న భూముల్లో జూలై రెండోవారంలో పలు ప్రాంతాల్లో మొక్కజొన్న విత్తనం వేశారు. విత్తనం విత్తే సమయంలో భూమిలో భూమిలో తేమ శాతం కూడా ఉంది. రైతులు ఎరువులు వేసి భూమిని చదును చేసి విత్తనం వేశారు. కానీ విత్తనం వేసి 12 నుంచి 15 రోజులు కావస్తున్నా మొలకలు రావడం లేదు. పొలంలో విత్తనాలు మొలకెత్తాయో లేదోనని రోజూ ఎదురు చూస్తున్నారు. కానీ నకిలీ విత్తనాల కారణంగా మొలకలు రావడం లేదని వాపోతున్నారు. విజయనగర జిల్లా హువినహడగలి వల్ల నుంకేసుల అనే రైతు పొలంలో మొక్కజొన్న విత్తనం వేసి 15 రోజులు కావస్తుందని కానీ మొలక జాడే లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూడ్లిగి లో పరమేశప్ప అనే రైతు తన 5 ఎకరాల పొలంలో మొక్కజొన్న విత్తనం వేశానని ఇంత వరకూ మొలకే ఎత్తలేదని వాపోతున్నాడు. ఏటా కొనే వ్యాపారుల దగ్గరే కొన్నామని, అయినా మోసపోయామని వాపోతున్నారు. హగరీబొమ్మనహల్లిలో సిద్దేశనాయక్ అనే రైతులు కూడా తన పొలంలో మొక్కజొన్న విత్తనం వేశామని ఇంత వరకూ మొలకే ఎత్తకుండా పోయిందని దిగులు చెందుతున్నారు. ఒకరిద్దరి రైతుల పొలంలో విత్తిన మొక్కజొన్న సాళ్ల సరిగ్గా మొలకే ఎత్తలేదు. విత్తన సాళ్ల సరిగ్గా మెలకే ఎత్తకుండా పోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. నకిలీ కంపెనీలను అరికట్టి వ్యవసాయాధికారులు తమకు న్యాయం చేయాలని వారు కోరుతున్నారు.



రెండు వారాలైనా మొలకెత్తని మొక్కజొన్న విత్తనాలు



పూజల్లో పాల్గొన్న ప్రతిపక్షనేత అశోక్, బీజేపీ నాయకులు



## ఘనంగా అభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ



## తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

| | ప్రస్తుతం | గత ఏడాది |
|---|---|---|
| నీటి మట్టం (అడుగులు) | 1625.43 | 1,631.99 |
| ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు) | 44,348 | 87,766 |
| ఔట్ ఫ్లో (క్యూసెక్కులు) | 46,016 | 83,766 |
| నీటి నిల్వ (టీఎంసీలు) | 77.91 | 101.73 |



కంప్లి కోట వద్ద వంతెనను తాకుతూ ప్రవహిస్తున్న తుంగభద్రమ్మ

# ఉప్పొంగుతున్న తుంగభద్ర

● కంప్లి, గంగావతి మధ్య రాకపోకలు బంద్ ● పొలాల్లోకి చేరుతున్న నీరు ● నీట మునిగిన పలు గృహాలు



కంప్లి, గంగావతి మధ్య రాకపోకలు నిలిపివేసిన అధికారులు

కంప్లి, జూలై27(ఆంధ్రజ్యోతి): తుంగభద్ర ఉధృతంగా ప్రవహిస్తోంది. శనివారం డ్యామ్ నుంచి నీరు వదలడంతో కాలవలు పొంగి పొర్లుతున్నాయి. కంప్లి కోట వద్ద తుంగభద్ర నదికి నీరు పోటెత్తడంతో కంప్లి గంగావతి రాకపోకలు అధికారులు నిలిపేశారు. జలాశయం నుంచి లక్ష క్యూసెక్కు లకు పైగా నీరు విడుదల చేయడంతో హంపి పుణ్యక్షేత్రంలో పలు మండపాలు నీటిలో మునిగాయి. కోట వద్ద రామసాగరకు వెళ్లే రోడ్డు మార్గంలో నీరు అధికంగా రావడంతో కోటి వద్ద చెరుకు పొలాలు నీటిలో మునిగాయి. సన్నాపురం గ్రామం వద్ద మోటార్లు నీటిలో మునిగిపోవడంతో రైతులు ఇబ్బంది పడ్డారు. పొలాల్లోకి నీరు చేరుతుండంతో నష్టం తప్పదని అన్నదాత ఆవేదన చెందుతున్నారు. తహసీల్దార్ నరసప్ప, మాట్లాడుతూ కంప్లి కోటలో నాలుగు ఐదు కుటుంబాలకు మాత్రమే కొద్ది వరకు నీరు చేరే అవకాశం ఉందని, వారిని ఇప్పటికే గంజి కేంద్రాలకు వద్దకు వెళ్లాలని సూచించామన్నారు. ఆదివారం రాత్రి జలాశయం నుంచి నీరు అధికంగా వచ్చే అవకాశం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వారితో పాటు పోలీసుశాఖ సీఐ వాసుకుమార్ ముఖ్య అధికారి మల్లికార్జున ఆర్ఐ జగదీష్ పురసభ అధ్యక్షుడు బట్ట ప్రసాద్, కౌన్సిలర్ సంఘ సంస్థ నేతలు కోట వద్ద వుండే వంతెనను పరిశీలించారు. నీరు తగ్గే వరకు ప్రజలు రాకపోకలు నిలిపివేయాలని సూచించారు.



సన్నాపురం వద్ద నీట మునిగిన చెరకు పంట

## ప్రియుడు మోసం చేశాడని నదిలో దూకి యువతి ఆత్మహత్య



యువతి ఆచూకీ కోసం గాలిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

బళ్లారి, జూలై 27 (ఆంధ్రజ్యోతి): ప్రియుడు మోసం చేశాడని యువతి నదిలో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. హూవినహడగలి తాలూక మదలగట్టి గ్రామానికి చెందిన జ్యోతి అనే యువతి తుంగభద్ర శనివారం సాయంత్రం నదిలోకి దూకి ఆత్మహత్యకు పాల్పడింది. సమీపంలో ఉన్న వ్యక్తులు గమనించి వెంటనే సమాచారం వారి పెద్దలకు తెలిపారు. అలాగే రంగంలోకి గజ ఈతగాళ్లను దించారు. అయితే ఆదివారం ఆమె మృతదేహం లభ్యం అయ్యింది. తన మరణానికి ఆదే గ్రామంలో ఉండే ఒక వ్యక్తే కారణమని, తనను ప్రేమించి మరో యువతితో ప్రేమలో పడి పెళ్లి చేసుకుంటున్నాడని తన డెత్‌నోట్ రాసి ఇంట్లో ఉంచి నదిలో దూకింది. డెత్ నోట్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు హూవినహడగలి పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. ఆ యువకుడు ఎవరనేది పోలీసులు ఆరా తీస్తున్నారు.

## రేషన్ బియ్యం పట్టివేత



బియ్యం వాహనాన్ని స్వాధీనం చేసుకున్న అధికారులు

సిరుగుప్ప, జూలై27(ఆంధ్రజ్యోతి): అక్రమంగా రవాణా చేస్తున్న సబ్సిడీ బియ్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సిరుగుప్ప తాలుకాలోని అళిగనూరు గ్రామం నుంచి సిరుగుప్ప వైపు వస్తున్న మూడు వాహనాలను స్థానికుల సమాచారం మేరకు ఎస్ఐ పరశురామ్ దాడి చేసి పట్టుకున్నారు. 385 బస్తాల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఆహార పౌరసరఫరాల ఇన్‌స్పెక్టర్ విజయ్ కుమార్ తెలిపారు. ఈ మేరకు పట్టణ పోలీస్ స్టేషన్లో కేసు దాఖలైంది.

## వచ్చే నెలలో బనారస్, నాందేడ్ ఎక్స్‌ప్రెస్‌లు రద్దు

విశాఖపట్నం, జూలై 27(ఆంధ్రజ్యోతి): ఒడిశాలోని సంబల్‌పూర్ స్టేషన్‌లో నాన్ ఇంటర్ లాకింగ్, యార్డు ఆధునికీకరణ పనులు జరగనున్న నేపథ్యంలో బనారస్, నాందేడ్ ఎక్స్‌ప్రెస్‌లు సహా పలు రైళ్లను రద్దు చేస్తూ, మరికొన్నింటిని మళ్లింపు మార్గంలో నడిపించనున్నామని వాల్తేర్ సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. రద్దయిన రైళ్లు విశాఖ-బనారస్ బై వీక్లీ ఎక్స్‌ప్రెస్ (18523) ఆగస్టు 10, 13 తేదీల్లో, బనారస్-విశాఖ ఎక్స్‌ప్రెస్ (18524) ఆగస్టు 11, 14 తేదీల్లో రద్దుచేశారు. సంబల్‌పూర్-నాందేడ్ ఎక్స్‌ప్రెస్ (20809) ఆగస్టు 8, 10, 11, 15 తేదీల్లో, నాందేడ్-సంబల్‌పూర్ ఎక్స్‌ప్రెస్ (20810) ఆగస్టు 9, 11, 12, 16 తేదీల్లో, సంబల్‌పూర్-రాయగడ ఎక్స్‌ప్రెస్ (18301), రాయగడ-సంబల్‌పూర్ ఎక్స్‌ప్రెస్ (18302) ఆగస్టు 7 నుంచి 16వ తేదీ వరకు రద్దు అయ్యాయి.

● టాటా-ఎర్నాకులం ఎక్స్‌ప్రెస్ (18189) ఆగస్టు 8 నుంచి 14 వరకు ఝార్సుగూడ రోడ్డు, సంబల్‌పూర్ సిటీ, నారజ్ నార్తాపూర్, అనుగుల్, ఖుర్దారోడ్డు, విజయనగరం మీదుగా, తిరుగు ప్రయాణంలో ఎర్నాకులం-టాటా ఎక్స్‌ప్రెస్ (18190) ఆగస్టు 7 నుంచి 13 వరకు విజయనగరం, ఖుర్దారోడ్డు, అనుగుల్, నారజ్ నార్తాపూర్, సంబల్‌పూర్ సిటీ, ఝార్సుగూడ రోడ్డు మీదుగా నడుస్తాయి. తాంబరం-జసిదిహ్ ఎక్స్‌ప్రెస్ (12375) ఆగస్టు 9న విజయనగరం, ఖుర్దారోడ్డు, అనుగుల్, నారజ్ నార్తాపూర్, సంబల్‌పూర్ సిటీ, ఝార్సుగూడ రోడ్డు మీదుగా, తిరుగు ప్రయాణంలో జసిదిహ్-తంబరం ఎక్స్‌ప్రెస్ (12376) ఆగస్టు 13న ఝార్సుగూడ రోడ్డు, సంబల్‌పూర్ సిటీ, నారజ్ నార్తాపూర్, అనుగుల్, ఖుర్దారోడ్డు, విజయనగరం మీదుగా నడుస్తాయి. ఎస్ఎంవీటీ బెంగళూరు-టాటానగర్ ఎక్స్‌ప్రెస్ (12889) ఆగస్టు 8న ఝార్సుగూడ రోడ్డు, సంబల్‌పూర్ సిటీ, నారజ్ నార్తాపూర్, అనుగుల్, ఖుర్దారోడ్డు, విజయనగరం మీదుగా, తిరుగు ప్రయాణంలో టాటానగర్-బెంగళూరు ఎక్స్‌ప్రెస్ (12890) ఆగస్టు 11న విజయనగరం, ఖుర్దారోడ్డు, అనుగుల్, నారజ్ నార్తాపూర్, సంబల్‌పూర్ సిటీ, ఝార్సుగూడ రోడ్డు మీదుగా నడుస్తాయి. బెంగళూరు-హటియా ఎక్స్‌ప్రెస్ (12836) ఆగస్టు 12న విజయనగరం, ఖుర్దారోడ్డు, అనుగుల్, నారజ్ నార్తాపూర్, సంబల్‌పూర్ సిటీ, ఝార్సుగూడ రోడ్డు మీదుగా నడుస్తుందని డీసీఎం పేర్కొన్నారు.



ఖైదీలతో డీసీ ప్రశాంత్ కుమార్ మిశ్రా, జైలు సూపరింటెండెంట్ లత

## ముగ్గురు ఖైదీల విడుదల

బళ్లారి, జూలై 27(ఆంధ్రజ్యోతి): జీవితఖైదు అనుభవిస్తున్న ముగ్గురు ఖైదీలను సత్ప్రవర్తన కారణంగా బళ్లారి సెంట్రల్ జైల్ నుంచి విడుదల చేశారు. విడుదలైన ఖైదీల్లో బళ్ళారి నగరానికి చెందిన గాదిలింగప్ప, విరేశ్, కొప్పళకు చెందిన యమనూరప్ప ఉన్నారు. జిల్లాధికారి ప్రశాంత్ కుమార్ మిశ్రా, బళ్ళారి సెంట్రల్ జైల్ సూపరింటెండెంట్ లతా ఆధ్వర్యంలో వారిని విడుదల చేశారు. గాదిలింగప్ప హత్య కేసులో జీవిత ఖైదు శిక్ష పడింది. యమనూరప్ప భార్య హత్య కేసులో, వీరేష్ కొడుకు, తమ్ముడి హత్య కేసులో శిక్ష అనుభవిస్తున్నారు. ఈ ముగ్గురు ఖైదీలు గత 14 సంవత్సరాల శిక్షను పూర్తి చేసినట్లు తెలిపారు. జైలులో స్వచ్ఛతా పనుల్లో ఈ ముగ్గురు పనిచేసేవారని జైలు అధికారులు తెలిపారు.

## ఘనంగా జోళదరాసి దొడ్డన్నగౌడ జయంతి



ఊరేగింపును ప్రారంభిస్తున్న ఫౌండేషన్ సభ్యులు

బళ్లారిరూరల్, జూలై27(ఆంధ్రజ్యోతి): జోళదరాసి 116వ జయంతిని ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. ఎర్రితాత దేవస్థానం నుంచి వేడుకల కార్యక్రమాన్ని జ్యోతిలక్ష్మీ దొడ్డన్నగౌడ ఫౌండేషన్, బళ్లారి జిల్లా కళావేదన సంఘం సంయుక్తంగా జ్యోతి వెలిగించి ఊరేగింపు ప్రారంభించారు. గమాక డాక్టర్ జోళదరాసి దొడ్డన్నగౌడ నివాసంలో సంగీతం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ అధ్యక్షుడు పంపనగౌడ రంగ తోరణం కార్యదర్శి కప్పగల్లు ప్రభుదేవా, బళ్లారి జిల్లా కళాకారుల సంఘం అధ్యక్షుడు యల్లన్నగౌడ, శంకరబండ కార్యదర్శి ముద్దెటినూరు తిప్పేస్వామి, కజెన్సీ రమణప్ప భజన్ మూడు సహ కార్యదర్శి సుబ్రహ్మణ్యం, వీరేష్ దలవాయి ఎమ్మిగనూరు జడపా శివేశ్వరగౌడ, కలకంబ, జోళదరాసి బసవరాజు, అమరేష్, నాగన్నగౌడ, శివరుద్రస్వామి, విరుపాక్షప్ప, సింధువాళ శశి, కొట్రప్ప హుస్సేన్, సుంకప్ప కుమారగౌడ, జయన్న, వన్నూరు స్వామి, ప్రముఖులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## మహిళలు హక్కుల కోసం పోరాడాలి

● చలవాది సంఘం రాష్ట్ర కార్యదర్శి చంద్రకుమారి



మాట్లాడుతున్న చంద్రకుమారి

సిరుగుప్ప, జూలై27 (ఆంధ్రజ్యోతి) : మహిళలు తమ హక్కుల కోసం పోరాటం కొనసాగించాలని చలవాది మహిళా సంఘం రాష్ట్ర కార్యదర్శి చంద్రకుమారి పిలుపునిచ్చారు. ఆదివారం సిరుగుప్ప పట్టణం ఏపీఎంసీ మార్కెట్ యార్డులో జనవాది మహిళా సంఘం ఆధ్వర్యంలో 6వ తాలుకా సమ్మేళనం జరిగింది. ఈ కార్యక్రమంలో చంద్రకుమారి మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో ముందడుగు వేయాలని కోరారు. విద్య, ఆర్థికం, సాంఘీకంగా, రాజకీయంగా ముందడుగు వేసిన నాడే భారతదేశం అభివృద్ధి బాటలో నడుస్తుందని ఆమె తెలిపారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకులు తిప్పయ్య, సురేష్, ఓబుళేశప్ప, ఈరణ్ణ, నాగరాజు, బసవరాజు, లక్ష్మణ్ణ, మహిళలు పాల్గొన్నారు.

## ఘనంగా పత్రికా దినాచరణ

● కార్యక్రమాన్ని ప్రారంభించిన మంత్రి శరణ ప్రకాశ్ పాటిల్

రాయచూరు, జూలై 27(ఆంధ్రజ్యోతి): సమాజ పురోగతిలో పత్రికా రంగానిది గురుతర బాధ్యత అని, ఆ విషయాన్ని ప్రభుత్వం తీవ్రంగా పరిగణించాల్సి ఉందని త్రివర్ణ న్యూస్ సంపాదకుడు బీఎం హనీఫ్ అన్నారు. పలు విశ్వ విద్యాలయాల్లో జర్నలిజం విభాగాలను రద్దు చేసేందుకు తీసుకుంటున్న నిర్ణయాలు ఆందోళనకరమన్నారు. ఆదివారం జిల్లాలోని లింగసుగూరు పట్టణం శ్రీగురు మహంతేశ పీఠం ఆవరణలో నిర్వహించిన పత్రిక దినాచరణ కార్యక్రమంలో ప్రధాన వక్తగా ఆయన ప్రసంగించారు. విద్యార్థుల సంఖ్య తగ్గి పోతుందన్న సాగుతో జర్నలిజం కోర్సులను నిలిపివేయడం సరికాదన్నారు. వాస్తవానికి ఆయా విశ్వ విద్యాలయాల్లో సౌకర్యాలు లేకపోవడం, ప్రభుత్వం నుంచి సకాలంలో నిధుల మంజూరు జరగకపోవడం వల్లే జర్నలిజం కోర్సుల్లో విద్యార్థులు చేరలేకపోతున్నట్లు తెలిపారు. అదే సమయంలో ప్రైవేటు కళాశాలలు, విశ్వ విద్యాలయాల్లో జర్నలిజం కోర్సును అభ్యశించే విద్యార్థుల సంఖ్య పెరుగుతుండడాన్ని ప్రభుత్వం తీవ్రంగా పరిగణించాలన్నారు. ఆ ప్రయత్నాన్ని విరమించుకుని పత్రిక రంగాన్ని మరింత బలోపేతం చేయడం పై ప్రభుత్వాలు దృష్టి సారించాలన్నారు. సమాజాన్ని సన్మార్గంవైపు నడిపే శక్తి విద్యరంగానికి ఉంటే సమాజ హితాన్ని కాంచిస్తు ఎప్పటికప్పుడు పాలకులకు సలహాలిచ్చే శక్తి పత్రిక రంగానికుందన్నారు. ఈ రెండు రంగాలను బలోపేతం చేయడం ద్వార సమాజ పురోగతిలో భాగస్వాములు కావాలన్నారు. కాగా విద్య, వైద్య రంగాలకు డిల్లీలోని గత ఆమ్ ఆద్మీ(ఆప్) ప్రభుత్వం 23,24 శాతం నిధులను కేటాయించడాన్ని ప్రస్తావించిన హనీఫ్, మిగితా రాష్ట్రాల్లోను విద్య, వైద్య రంగాలకు గణనీయమైన కేటాయింపులు జరపాలని కోరారు.ఈ సందర్భంగా పలువురు పాత్రికేయులకు ప్రశంసలు అందజేసి జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో మంత్రులు డాక్టర్ వరణ ప్రకాశ్ పాటీల్, ఎన్ఎస్ భోసరాజు తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న మంత్రి శరణ ప్రకాశ్ పాటిల్

## నేటి నుంచి శ్రీవారి పవిత్రోత్సవాలు

రాయచూరు, జూలై 27(ఆంధ్రజ్యోతి): నగరంలోని ప్రముఖ విద్య సంస్థ నవోదయలో సోమవారం నుంచి శ్రీవారి పవిత్రోత్సవాలను ప్రారంభించనున్నారు. ఇందుకోసం విద్యాసంస్థ ప్రాంగణంలోని వెంకటేశ్వర స్వామి ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. నాలుగు రోజుల పాటు సాగే ఉత్సవాలను సోమవారం తెల్లవారు జామున సుప్రభాత సేవతో ప్రారంభించనున్నారు. తిరుమల తిరుపతి దేవస్థానానికి చెందిన అర్చకులు పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నారు.



ముస్తాబైన శ్రీవారి ఆలయం

## పోటాపోటీగా సహకార సంఘం ఎన్నికలు



ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న సొసైటీ సభ్యులు

కంప్లి, జూలై27(ఆంధ్రజ్యోతి): సిరిగేరి ప్రాథమిక కృషి పత్తిన వ్యవసాయ సహకార సంఘ సభ్యులు ఎన్నికలు పోటా పోటీగా జరిగింది. 12 మంది సభ్యులు గాను 26 మంది నామినేషన్ వేశారని అధికారి తెలిపారు. ఆ పోటీలో నుండి డి చన్నప్ప, ఎస్ఎం నాగరాజు స్వామి, బీ వీరేష్, సుగ్గినళ్లి, రుద్రప్ప, బి సోమశేఖరప్ప, జే గౌరమ్మ, బి జలజాక్షమ్మ, రమేష్, మల్లయ్య నాయక్, మల్లయ్యగౌడ్, శివప్ప అత్యధిక ఓట్లతో గెలుపు సాధించినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి సురేంద్ర తెలిపారు. ఎన్నికలు శుక్రవారం, శనివారం జరిగాయి. గెలుపొందిన సభ్యులు ఆదివారం గ్రామంలోని ఆలయంలో పూజలు నిర్వహించారు. పలువురు నాయకులు విజేతలను పూలమాలలతో అభినందించి సన్మానించారు.

# హోసూరు జోన్

## రాజ్‌పుథ్ సంఘానికి అండగా ఉంటాం: ఎమ్మెల్యే




ఎమ్మెల్యే ప్రకాశ్‌ను సత్కరిస్తున్న సంఘం సభ్యులు

హోసూరు, జూలై 27 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు రజ్‌పుత్ పొంధిల్ సంఘం రాష్ట్ర కార్యనిర్వాహ కమిటీ సభ్యుల సమావేశం నగరంలోని భవానిప్యాలెస్‌లో ఆదివారం జరిగింది. సంఘం కృష్ణగిరి జిల్లా అధ్యక్షుడు ఇందర్‌సింగ్ అధ్యక్షత వహించగా రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ భవానిసింగ్ పాల్గొన్నారు. సమావేశంలో 10, 12వ తరగతులలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు ఎమ్మెల్యే ప్రకాశ్, మేయర్ సత్య అందచేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రకాశ్ సంఘానికి అండగా ఉంటామని ప్రకటించారు. సెంజికోటను ప్రపంచ వారసత్వంగా ప్రకటించినందుకు యునెస్కో సంస్థకు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. విల్లుపురం జిల్లా సెంజి సమీపాన నిర్మించిన దేశింగురాజన్ ఆలయంలో రాజదేసింగ్ విగ్రహం ఏర్పాటుకు అనుమతి కోసం ప్రభుత్వానికి విన్నవించేలా సమావేశంలో తీర్మానించారు. సమావేశంలో సంఘం ప్రధాన కార్యదర్శి ప్రకాశ్‌సింగ్, ఉపాధ్యక్షులు విజయకుమార్, సురేశ్‌బాబు, గజేంద్రసింగ్ పాల్గొన్నారు.

## ఘనంగా అన్నమాచార్య జయంతి

హోసూరు, జూలై 27 (ఆంధ్రజ్యోతి): హోసూరు నగరంలోని ఆంధ్ర సాంస్కృతిక సమితి ఆవరణలో తాళ్లపాక అన్నమాచార్యుల 616 జయంతి ఆదివారం ఘనంగా జరిగింది. టీటీడీ అన్నమాచార్య ప్రాజెక్టు, ఆంధ్ర సాంస్కృతిక సమితి సంయుక్త ఆధ్వర్యంలో కార్యక్రమాలు ఏర్పాటయ్యాయి. ఎంపీ గోపినాథ్, ఎమ్మెల్యే వై ప్రకాశ్ ముఖ్యులుగా పాల్గొన్నారు. హరికథ, సంగీత విభావరి కార్యక్రమాలు సభికులను అలరించాయి. పెద్దసంఖ్యలో స్థానికులు పాల్గొన్నారు.



హరికథ చెబుతున్న కళాకారుడు




ఉపాధ్యాయులు, కోచ్‌తో విజేత జట్టు

## రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీల్లో ప్రతిభ

హోసూరు, జూలై 27(ఆంధ్రజ్యోతి): తిరుపత్తూరు జిల్లా వానియంబాలిలోని ఎంకేజే ప్రైవేట్ కళాశాలలో రాష్ట్ర స్థాయి పాఠశాలల మధ్య వాలీబాల్, బాస్కెట్‌బాల్, ఫుట్ బాల్, ఎరిప్యుటేషన్ తదితర పోటీలు జరిగాయి. వాలీబాల్ పోటీల్లో హోసూరుకు చెందిన యోగివేమన పాఠశాల జట్టు రెండోస్థానంలో నిలిచింది. వాలీబాల్ ఫైనల్‌మ్యాచ్‌లో కడలూరు సెయింట్ హయ్యర్ సెకండరీ స్కూల్ జట్టుపై హోసూరు యోగి వేమన పాఠశాల జట్టు ఓడిపోయింది. కోచ్ మాణిక్యవాసగన్‌ను పాఠశాల ప్రిన్సిపాల్ మునిరెడ్డి, ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్ కార్తీక్‌లు అభినందించారు.

## నేడు మహిళా కాంగ్రెస్ జిల్లా కమిటీ సమావేశం



విలేకరులతో మాట్లాడుతున్న నిర్మలా బెణ్ణె

రాయచూరు, జూలై27(ఆంధ్రజ్యోతి): నగరంలోని ఆశాపూర్ రోడ్డు ప్రైవేటు ఫంక్షన్‌హాల్‌లో ఈ నెల 28వ తేదీ సోమవారం జిల్లా మహిళ కాంగ్రెస్ కమిటీ సమావేశం ఏర్పాటు చేసినట్లు పార్టీ జిల్లా అధ్యక్షురాలు నిర్మలా బెణ్ణె తెలిపారు. ఆదివారం నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో ఆమె విలేఖరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. జిల్లా కమిటీ సమావేశానికి రాష్ట్ర అధ్యక్షురాలు సౌమ్యరెడ్డి హాజరవుతారన్నారు. మహిళ కాంగ్రెస్‌ను జిల్లాలో బలోపేతం చేయడంతో పాటు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఐదు గ్యారెంటీ పథకాలపై చర్చ ఉంటుందన్నారు. ఐదు గ్యారెంటీ పథకాల్లో ప్రధానంగా మూడు పథకాలు మహిళల కోసం ఉద్దేశించినవే కావడంతో ఈ విషయంలో మహిళ కాంగ్రెస్ పాత్ర కీలకంగా ఉంటుందన్నారు. సమావేశానికి జిల్లాలోని మహిళ కార్యకర్తలు పాల్గొన్నారు.

## బెల్టుషాపులను తొలగించాలని వినతి

కంప్లి, జూలై27(ఆంధ్రజ్యోతి): సిరిగేరి సమీపంలోని సుగూరు గ్రామంలో అక్రమంగా మద్యం అమ్ముతున్న వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ శనివారం సాయంత్రం గ్రామ పంచాయతీ కార్యదర్శి శివమూర్తికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా బీమ్ ఆర్మీ సంస్థ అధ్యక్షులు మారెప్ప మాట్లాడుతూ గ్రామంలోని కిరాణ దుకాణాలు, హోటళ్లలో అక్రమంగా మద్యం అమ్ముతున్నారని, యువకులు, వృద్ధులు, మద్యపానానికి బానిసలవుతున్నారని పిల్లలకు విద్య అందడం లేదన్నారు. వారికి తిండి దొరకడం లేదు. పేదలు ఇంట్లో దాచుకున్న డబ్బును మద్యం కోసం ఖర్చు చేస్తున్నారన్నారు. అక్రమంగా మద్యం అమ్మేవారిపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యదర్శి శివమూర్తి మాట్లాడుతూ దీనిని పోలీసు ఎక్సైజ్ శాఖల దృష్టికి తీసుకెళ్తామని, అక్రమ అమ్మకాలపై చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో సోమశేఖరప్ప, నాయకులు ప్రకాష్, ఉట్నూరు నాగరాజు, గిరీష్, రమ, చిదానంద, ఎం రమేష్, శేఖర్ పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న భీమ్ ఆర్మీ సంఘం పదాధికారులు

## నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాంప్...

### కాసు బ్రహ్మానందరెడ్డి (జయంతి)



ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు ముఖ్యమంత్రిగా వ్యవహరించిన కాసు బ్రహ్మానంద రెడ్డి 1909 జూలై 28న గుంటూరు జిల్లా నరసారావుపేట ప్రాంతంలో జన్మించారు. మహాత్మాగాంధీ పిలుపుతో సత్యాగ్రహ, క్విట్ ఇండియా ఉద్యమాలలో పాల్గొని జైలుకెళ్లారు. కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడిగా వ్యవహరించారు. కేంద్ర, రాష్ట్రాలలో మంత్రి పదవుల తోపాటు అనేక పార్టీ పదవులను నిర్వహించారు. బహుళార్ధ సాధకప్రాజెక్టు నాగార్జున సాగర్ ప్రాజెక్టు, తుంగభద్ర డ్యామ్, పోచంపాడు ప్రాజెక్టుల ఏర్పాటు, సికింద్రాబాద్ కేంద్రంగా దక్షిణమధ్య రైల్వే ఏర్పాటు కావడంలో కీలకంగా వ్యవహరించారు. ఎన్నో సంక్షేమాలు అమలు చేశారు. 1994 మే 20న కన్నుమూశారు.

### జైపాల్‌రెడ్డి (వర్ధంతి)



ఉత్తమ పార్లమెంటేరియన్‌గా పేరొందిన సూదిని జైపాల్‌రెడ్డి 1942 జనవరి 16న జన్మించారు. లోక్‌సభ సభ్యుడిగా ఐదుసార్లు ఎన్నికయ్యారు. కాంగ్రెస్ పార్టీలో సీనియర్ నేత. కల్వకుర్తి ఎమ్మెల్యేగా, చేవెళ్ళ ఎంపీగాను గెలుపొందారు. కేంద్ర సమాచార శాఖ, ప్రసార మంత్రిగా, ఎర్త్ సైన్స్ మంత్రి, సైన్స్ అండ్ టెక్నాలజీ మంత్రి సహా తదితర శాఖలను నిర్వహించారు. రాజ్యసభ సభ్యుడి గాను కొనసాగారు. చట్టసభలలో ఆయన ప్రసంగాలు ఎంతో కీలకంగా ఉండేవి. 1998లో అత్యుత్తమ పార్లమెంటేరియన్‌గా ఎన్నుకోబడ్డారు. 2019 జూలై 28న కన్నుమూశారు.

### రావి కొండలరావు (వర్ధంతి)



ప్రముఖ నటుడు రావి కొండలరావు 1932 ఫిబ్రవరి 11న సామర్లకోటలో జన్మించారు. నటుడు, దర్శకుడు, రచయిత, పాత్రికేయుడు, నిర్మాతగా బహుముఖ ప్రజ్ఞాశాలి. సుమారు 600 సినిమాలలో నటించారు. సినిమా రచనలే కాకుండా ఆంధ్రజ్యోతి, ఆంధ్రప్రభ, ఆంధ్రపత్రిక, ఉదయం తదితర దిన, వార, మాసపత్రికలలో ఆయన రచనలు ప్రచురితమయ్యాయి. 'సుకుమార్' కలంపేరిట కొన్ని రచనలు చేశారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం 'కళాప్రపూర్ణ'తో గౌరవించింది. జీవితసాఫల్య పురస్కారం, ఇతర గౌరవాలు అందుకున్నారు. 2020 జూలై 28న కన్నుమూశారు.

### ధనుష్ (పుట్టినరోజు)




తమిళ సినీ నటుడు ధనుష్ 1983 జూలై 28న చెన్నైలో జన్మించారు. అసలు పేరు వెంకటేశ్ ప్రభు కస్తూరి రాజా. నటుడు, నిర్మాత, దర్శకుడు, రచయిత, గేయ రచయిత, నేపథ్య గాయకుడిగా రాణించారు. తమిళంతోపాటు తెలుగులోనూ ఆయన సినిమాలు హిట్ అయ్యాయి. 13 సైమా అవార్డులు, 9 విజయ్, 4 నేషనల్ ఫిల్మ్ అవార్డ్ ఇతర పురస్కారాలు అందుకున్నారు. 'వై దిస్ కొలవెరి డి' అనే పాట యూట్యూబ్‌లో 100 మిలియన్ వ్యూస్ అందుకున్న తొలి ఇండియన్ మ్యూజిక్ వీడియో కావడం విశేషం. కాగా తమిళ సూపర్‌స్టార్ రజనీకాంత్ అల్లుడు కూడా కావడం విశేషం.

### దుల్కర్ సల్మాన్ (పుట్టినరోజు)



ప్రముఖ మళయాళ నటుడు మమ్ముట్టి కుమారుడు దుల్కర్ సల్మాన్ 1986 జూలై 28న కొచ్చిలో జన్మించారు. 2012లో సెకండ్ షో అనే మళయాళ సినిమాతో తెరంగేట్రం చేశారు. మళయాళ, తమిళ భాషల సినిమాల్లో పేరొందారు. తెలుగులోనూ గుర్తింపు సాధించారు. మహానటి, సీతారామం సినిమాలు హిట్ అయ్యాయి. ఉత్తమ నటుడు తోపాటు ఫిలింఫేర్ అవార్డులు పొందారు.

### హారీ కేన్ (పుట్టినరోజు)



హారీ ఎడ్వర్డ్ కేన్ 1993 జూలై 28న లండన్‌లోని వాల్తామ్‌స్టో ప్రాంతంలో జన్మించారు. ఇంగ్లండ్ దేశ ఫుట్‌బాల్ జాతీయ జట్టు కెప్టెన్. ప్రీమియర్ లీగ్ క్లబ్‌కు స్ట్రైకర్‌లో ఉన్నారు. ప్రపంచంలో ఉత్తమ స్ట్రైకర్‌గా పేరొందారు. ఇంతవరకు 350కుపైగా గోల్స్ సాధించారు. ఫస్ట్ ఫుల్ సీజన్‌లో 31 గోల్స్ సాధించి రికార్డు నెలకొల్పారు. 2018 ఫిఫా వరల్డ్ కప్‌కు కెప్టెన్‌గా వ్యవహరించారు. 'మెంబర్ ఆఫ్ ది ఆర్డర్ ఆఫ్ ది బ్రిటీష్ ఎంపైర్' హోదా సాధించారు. పలు గౌరవాలు అందుకున్నారు. 2022లో హారికేన్ ఫౌండేషన్ ఏర్పాటు చేశారు. చింగ్‌ఫోర్డ్‌లో ఆయన విగ్రహం ఏర్పాటు చేశారు.

# అమృత్-2 పథకానికి శ్రీకారం

బాగేపల్లి, జూలై27(ఆంధ్రజ్యోతి): పట్టణంలో తాగునీటి సరఫరాకు సంబంధించి అమృత్-2 యోజనెను నగరాభివృద్ధిశాఖ మంత్రి బైరతి సురేశ్ ప్రారంభించారు. చిత్రావతి డ్యాం నుంచి పట్టణానికి తాగునీటిని సరఫరా చేసే పనులకు శనివారం శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ భాగ్యనగర్‌కు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలను కల్పించేందుకు కట్టుబడ్డామన్నారు. సీఎం సిద్దరామయ్య నేతృత్వంలో ఈ ప్రాంతానికి విద్య, వైద్యం అందించడంలో తగిన ప్రాధాన్యత ఇస్తామన్నారు. జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి డాక్టర్ ఎంసీ సుధాకర్ మాట్లాడుతూ తాను, ఎమ్మెల్యే సుబ్బారెడ్డి నిరంతర శ్రమతో గంటలమల్లమ్మ డ్యాంకు రూ.189 కోట్ల పథకానికి ఆమోదం దక్కిందన్నారు. బాగేపల్లిని భాగ్యనగర్‌గా మరునామకరణం చేసేందుకు ఎంతో శ్రమించారన్నారు. ఈ ప్రాంతంలో పరిశ్రమలు వస్తాయని, 600 ఎకరాలు కేటాయిస్తున్నట్టు తెలిపారు. ఇంకా 500 ఎకరాల భూమికి ప్రాథమిక ఆమోదం లభించిందన్నారు. ఎంపీ డాక్టర్ కే సుధాకర్ మాట్లాడుతూ చిత్రావతి డ్యాంకు ఎస్ఎం కృష్ణ పేరు పెట్టదలిచేలా చర్చలు జరిగాయన్నారు. దేశంలో ప్రతి ఒక్క ఇంటికీ నీరును అందించే మహత్తర లక్ష్యంతో జలజీవన్ మిషన్, అమృత్ 2.0 పథకాలు అమలు చేస్తున్నట్టు తెలిపారు. ఈ పథకాలకు కేంద్రప్రభుత్వం 50శాతం, రాష్ట్ర ప్రభుత్వం 40శాతం, స్థానిక సంస్థలు 10 శాతం గ్రాంట్లు కేటాయిస్తున్నారు. చిక్కబళ్ళాపుర జిల్లాకు సుమారు 300 కోట్ల రూపాయల గ్రాంటు కేంద్రప్రభుత్వం తాగునీటికి కేటాయించిందన్నారు. పథకం ఒకటిన్నర ఏడాదిలో పూర్తి కానుందన్నారు.



ప్రారంభోత్సవంలో మంత్రులు బైరతి సురేశ్, డాక్టర్ ఎంసీ సుధాకర్, ఎంపీ డాక్టర్ కే సుధాకర్, ఎమ్మెల్యే సుబ్బారెడ్డి తదితరులు

# చదువు, వృత్తిలో నిరంతర నైపుణ్యత కీలకం

» బోయింగ్ సంస్థ ఈడీ సీమా చోప్రా

బెంగళూరు, జూలై 27 (ఆంధ్రజ్యోతి): చదువు, వృత్తిలో నిరంతరం నైపుణ్యత సాధించాలనే పట్టుదల, వాటిపట్ల అభిమానం ఉంటేనే జీవితంలో ఉన్నతస్థాయికి కీలక మార్గదర్శకం కానుందని బోయింగ్ సంస్థ ఏఐ ఈడీ, సీనియర్ టెక్నికల్ ఫెలో డాక్టర్ సీమాచోప్రా అభిప్రాయపడ్డారు. గీతం యూనివర్సిటీలో స్నాతకోత్సవం ఆదివారం జరిగింది. విద్యార్థులను ఉద్దేశించి సీమాచోప్రా మాట్లాడుతూ.. ఏఐ వంటి సాంకేతికత ద్వారాఎటువంటి సందేహమైనా క్షణాలలో నివృత్తి చేసుకోవడం సాధ్యమన్నారు. ఇంజనీరింగ్‌తో చదువు పూర్తయ్యిందని భావించరాదని, పరిశోధనలవైపు దృష్టి సారించాలన్నారు. స్టార్టప్‌లవైపు ఆలోచించాలని సూచించారు. గీతం ప్రో-వైస్ చాన్స్‌లర్ కేఎస్ఎస్ ఆచార్య మాట్లాడుతూ విద్యావ్యవస్థలో వస్తున్న మార్పులు ప్రపంచంతో పోటీపడేలా విద్యార్థులను తీరుస్తున్నాయన్నారు. జ్ఞాన సముపార్జనకు యూనివర్సిటీలు వేదికలుగా పనిచేస్తున్నాయన్నారు. ఒకప్పుడు రెండుమూడు ల్యాబ్‌లు ఉండేవని ప్రస్తుతం ప్రతి విభాగానికి పరిశోధనలకు అనువైన రీతిలో సౌలభ్యాలు వచ్చాయన్నారు. 1239మందికి డిగ్రీ పట్టాలు, 54 మందికి పీజీ, 17మందికి డాక్టరేట్‌లతో కలిపి 1310మందికి పట్టాలను ప్రదానం చేశారు. 18మంది విద్యార్థులకు ప్రెసిడెంట్ గోల్డ్‌మెడల్‌ను ప్రదానం చేసి అభినందించారు.. బిజినెస్ అసోసియేట్ ప్రొఫెసర్ సెంథిల్‌కుమార్‌తోపాటు పలువురు పాల్గొన్నారు.



స్నాతకోత్సవంలో పాల్గొన్న విద్యార్థులు తదితరులు

# పిల్లల సర్వతోముఖాభివృద్ధిలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల పాత్ర కీలకం

» గ్రామపంచాయతీ సభ్యుడు ఉమేశ్

శిడ్లఘట్ట, జూలై 27 (ఆంధ్రజ్యోతి): పిల్లల విద్య సర్వతోముఖాభివృద్ధిలో ఉపాధ్యాయులు ఎంత ముఖ్యమో తల్లిదండ్రుల పాత్ర అంతే ముఖ్యమని గ్రామపంచాయతీ సభ్యుడు ఆర్ఏ ఉమేశ్ అభిప్రాయపడ్డారు. తాలూకాలోని మేలూరు గ్రామం ప్రభుత్వ హైస్కూల్‌లో ఏర్పాటైన పేరెంట్స్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ బాధ్యతను సమర్థవంతంగా నిభాయించాలని అభిప్రాయపడ్డారు. ఈసారి ఎస్ఎస్ఎల్‌సీ ఫలితాలలో వంద శాతం ఉత్తీర్ణ సాధించేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రధానోపాధ్యాయుడు హెచ్‌ఎం భాస్కర్ ఋమాట్లాడుతూ.. ఇంటిలో పిల్లలు చదువుకునే వాతావరణం కల్పించాల్సిన బాధ్యత తల్లిదండ్రులదేనన్నారు. పిల్లలను మొబైల్‌కు బానిస చేయరాదని, టీవీ చూడడం తగ్గించాలని, విద్యపై దృష్టి సారించేలా ప్రోత్సహించాలన్నారు. పిల్లలకోసం మీరు పడుతున్న శ్రమ వృథా కారాదన్నారు. ఎస్ఎస్ఎల్‌సీలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థిని సుప్రియాను విజయపుర రోటరీ సంస్థ మాజీ అధ్యక్షుడు మంజునాథ అభినందించి నగదు ప్రోత్సాహకం అందచేశారు. గ్రామపంచాయతీ అధ్యక్షురాలు శశికళ రమేశ్, ఎస్‌డీఎంసీ అధ్యక్షురాలు నందిని, స్కూల్ అసిస్టెంట్ సుజాత, గాయత్రి, సవితా, తులసిమాల, దేవమ్మ, పద్మ, నాగరాజ్, అరుణ, సౌందర్య, రోటరీ సంస్థ పదాధికారులు పాల్గొన్నారు.



విద్యార్థినికి ప్రోత్సాహకం అందజేస్తున్న దృశ్యం

# ధర్మస్థళలో మహిళా కేసులు మళ్లీ విచారించాలి

» మహిళా సంఘం డిమాండ్




అఖిల భారత జనవాది మహిళా సంఘం సభ్యుల సమావేశం

బెంగళూరు, జూలై 27(ఆంధ్రజ్యోతి): దక్షిణ కన్నడ జిల్లా ధర్మస్థళ గ్రామంలో గతంలో హత్యకు గురైన పద్మలత, వేదవతి, సౌజన్య, యమున వంటి ఎంతోమంది యువతుల అనుమానాస్పద మరణాలపై మళ్లీ విచారణ జరపాలని అఖిల భారత జనవాది మహిళా సంఘం డిమాండ్ చేసింది. మంగళూరులో ఆదివారం జిల్లా అధ్యక్షురాలు జయంతిశెట్టి, ఉపాధ్యక్షురాలు ఈశ్వరి బళ్ళుంజాల ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఈశ్వరి బళ్ళుంజా మాట్లాడుతూ ధర్మస్థళ గ్రామంలో అత్యాచారాలు, హత్యలకు సంబంధించి అనుమానాలు ఉన్న అన్ని కేసులను సమగ్రంగా విచారణ జరపాలన్నారు. వందకు పైగా మృతదేహాలు పాతిపెట్టానంటూ బహిరంగంగా ప్రకటిస్తున్న వ్యక్తిని రక్షించి సమగ్ర వివరాలు తెలుసుకోవాలన్నారు. నిష్పక్షపాతంగా దర్యాప్తు జరుగుతుందా అనే అనుమానం ఉందన్నారు. ప్రజలలో ఆందోళన రావడం పలు సంఘాల నేతలు డిమాండ్ చేయడంతో ప్రభుత్వం సిట్‌ను ఏర్పాటు చేసిందన్నారు. అయితే సాక్షితోపాటు అతడి తరపు న్యాయవాదికి భద్రత కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. 80వ దశకంలో కిడ్నాప్‌కు గురై, ఆ తర్వాత హత్య జరిగిన ఆరోపణలు ఉన్నాయ న్నారు. ధర్మస్థళ ప్రాంతంలో అనుమానాస్పద మృతుల కేసులను విచారణ జరపాలని సమా వేశంలో తీర్మానించారు.

# సైక్లింగ్‌తో ఆరోగ్యం

» ఐటీబీపీ డీఐజీ అన్వర్ ఇలాహి

విజయపుర, జూలై 27 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ సైక్లింగ్‌ను పాటించడం ద్వారా ఉత్తమ ఆరోగ్యం సాధ్యం చేసుకోవాలని ఇండో టిబెటియన్ బోర్డర్ పోలీస్ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ అన్వర్ ఇలాహి అభిప్రాయపడ్డారు. సమీపంలోని సుంద్రహళ్ళిలోగల ఐటీబీపీ క్యాంప్‌లో కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ఖేలో ఇండియాలో భాగంగా ఫిట్ ఇండియా లక్ష్యంగా ఆదివారం సైకిల్‌థాన్ నిర్వహించారు. ఐటీబీపీ సిబ్బంది, అధికారులు, బెంగళూరు, చిక్కబళ్ళాపుర, బెంగళూరు గ్రామీణ జిల్లాల్లో సుమారు 40 కిలోమీటర్ల సైక్లింగ్‌కు శ్రీకారం చుట్టారు. కమాండింగ్ ఆఫీసర్ ప్రకాశ్‌చంద్రసింగ్ మాట్లాడుతూ దేశభద్రతలో సైనికులు నిమగ్నమై ఉంటారని వారికి శారీరక పటుత్వం తప్పనిసరిగా ఉండాలనే లక్ష్యంతోపాటు ప్రజలలో ఫిట్‌నెస్‌పై అవగాహన కల్పించేలా మూడు జిల్లాల్లో సైక్లింగ్ అభియాన చేపట్టామన్నారు. ఈ సందర్భంగా ఐటీబీపీ సీఎంఓ డాక్టర్ అజయ్‌కుమార్ సచిన్, డిప్యూటి కమాండర్‌లు మునేశ్‌బాబు, సిద్దార్థ త్రిపాఠి, అసిస్టెంట్ కమాండెంట్ షబ్బం తదితరులు పాల్గొన్నారు.



సైకిల్ తొక్కుతున్న ఐటీబీపీ ఉద్యోగులు, అధికారులు

# పెజావర మఠాధిపతిచే 'పద్మగంధి' పాటలు విడుదల

బెంగళూరు, జూలై27(ఆంధ్రజ్యోతి): పద్మగంధి సినిమా పాటలను పెజావర మఠాపతి విశ్వప్రసన్నతీర్థ స్వామీజీ ఆవిష్కరించారు. ఆదివారం మల్లేశ్వరంలో జరిగిన కార్యక్రమంలో ట్రైలర్ ఆవిష్కరణతోపాటు పాటలను విడుదల చేశారు. కన్నడ, హిందీ, సంస్కృత భాషలలో సినిమాను రూపొందించినట్టు దర్శకుడు సుచేంద్రప్రసాద్ తెలిపారు. మఠాధిపతి విశ్వప్రసన్నతీర్థస్వామీజీ నటులతోపాటు దర్శక నిర్మాతలు, సినిమా బృందాన్ని ఆశీర్వదించారు. పద్మగంధి సినిమాను ఎంఆర్ లీల నిర్మించగా, మ్యూజిక్‌ను సంగీత దర్శకుడు దీపక్ పరమేశ్వర్ సమకూర్చారు.



మీడియాతో దర్శకుడు సుచేంద్రప్రసాద్ తదితరులు

## వైసీపీవి అన్నీ జిమ్మిక్కులు: టీడీపీ

హిందూపురం, జూలై 27(ఆంధ్రజ్యోతి): వైసీపీ నాయకులు జిమ్మిక్కులు చేస్తున్నారని టీడీపీ పట్టణ కన్వీనర్ ప్రెస్ వెంకటేశ్ అన్నారు. పట్టణంలోని మోడల్ కాలనీకి చెందిన టీడీపీ కార్యకర్తలు వైసీపీలో చేరినట్లు తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు. ఆదివారం కొంతమంది వైసీపీలో చేరారంటూ వైసీపీ నాయకులు సోషల్ మీడియాలో పోస్టు చేశారని, అవన్నీ తప్పుడే ప్రచారాలేనన్నారు.

# వైభవంగా ప్రాణప్రతిష్ఠ

పరిగి, జూలై 27(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పెద్దిరెడ్డిపల్లిలో పెన్నానది తీరంలో నూతనంగా నిర్మించిన అభయాంజనేయస్వామి ఆలయంలో స్వామివారి విగ్రహానికి ఆదివారం వైభవంగా ప్రాణప్రతిష్ఠ జరిగింది. ఈ సందర్భంగా గ్రామస్థుల పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ గోవిందరెడ్డి, సర్పంచ్ బాలాజీ, జిల్లా తెలుగు యువత కార్యదర్శి ప్రవీణ్‌రెడ్డి, జూలారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ప్రాణ ప్రతిష్ఠలో పాల్గొన్న నాయకులు

# గర్వించదగ్గ శాస్త్రవేత్త అబ్దుల్ కలాం

పెనుకొండ టౌన్, జూలై 27(ఆంధ్రజ్యోతి): భారతదేశం గర్వించదగ్గ శాస్త్రవేత్త ఏపీజే అబ్దుల్ కలాం అని యాదవ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ కేశవయ్య అన్నారు. అబ్దుల్ కలాం 10వ వర్ధంతిని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ ఆదర్శవంతమైన నాయకుడు మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కాలం అని, దేశంపై ఆయన చూపిన అంకిత భావం అసాధారణమన్నారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ కన్వీనర్ శ్రీరాములు, త్రివేంద్ర, బాబుల్‌రెడ్డి, బీజేపీ నాయకుడు రామకృష్ణ, ప్రజా సంఘాల నాయకులు పెద్దన్న, రామాంజినేయులు, జాఫర్ పాల్గొన్నారు.



కలాం విగ్రహం వద్ద నివాళి అర్పిస్తున్న నాయకులు

## ఘనంగా అభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ

బెంగళూరు, జూలై 27(ఆంధ్రజ్యోతి): పద్మనాభనగర్ నియోజకవర్గం భువనేశ్వరినగర్‌లోని మహాగణపతి, మహాలక్ష్మీ సమేత సత్యనారాయణ స్వామి, సద్గురు సాయిబాబా దేవస్థాన ట్రస్టు ఆధ్వర్యంలో అభయ ఆంజనేయస్వామి ప్రతిష్ఠాపన, కుంభాభిషేకం కార్యక్రమాలు ఆదివారం ఘనంగా జరిగాయి. ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో ప్రతిపక్షనేత అశోక్ ముఖ్యులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా బీజేపీ హోబళి నాయకులు లక్ష్మీకాంత్, వెంకటస్వామి నాయుడు, సంగాతి వెంకటేశ్, ఉమేశ్ కబ్బాళ్, జోళరాజ్, టీటీడీ సభ్యుడు నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

## 'మెదడుకు మేత'లో పోటీపడిన చిన్నారులు




జ్ఞాపికలతో విద్యార్థుల బృందం

బెంగళూరు, జూలై 27 (ఆంధ్రజ్యోతి): గణితంలో ప్రతిభ చాటేందుకు మెదడుకు మేత పోటీలలో చిన్నారులు రాణించారు. ఆదివారం నిమ్హాన్స్ కన్వెన్షన్‌హాల్‌లో రాష్ట్రస్థాయి 166వ బ్రెయినో బ్రెయిన్ కర్ణాటక ఉత్సవ పేరిట పోటీలు జరిపారు. బెంగళూరుతోపాటు రాష్ట్రంలోని అన్ని జిల్లాలకు చెందిన 4-14 ఏళ్ల చిన్నారులు పాల్గొన్నారు. 261మంది పోటీలో పాల్గొనగా విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. బ్రెయినో బ్రెయిన్ ఇంటర్నేషనల్ ఎండీ ఆనంద్‌సుబ్రమణియమ్, డైరెక్టర్ అరుణ్ సుబ్రమణియమ్‌ల పర్యవేక్షణలో పోటీలు జరిగాయి.

## రోబోటిక్ సర్జరీలతో తక్కువ నొప్పులు

బెంగళూరు, జూలై27(ఆంధ్రజ్యోతి): వైద్యరంగంలో ఆధునాతనం వచ్చిందని రోబోటిక్ సర్జరీలతో తక్కువ నొప్పితోపాటు నాణ్యత సాధ్యమని మెడికవర్ ఆసుపత్రి గైనకాలజిస్ట్ సబీహా అంజు అభిప్రాయపడ్డారు. గర్భాశయ రక్తస్రావ, పెల్విక్ బాధతో ఉన్న 42 ఏళ్ల మహిళకు శస్త్రచికిత్స రోబోటిక్ ద్వారా చేసినట్టు తెలిపారు. ఆదివారం ఆమె మీడియాకు ఒక ప్రకటన విడుదల చేశారు. రోబోటిక్ తో గర్భాశయం తొలగించే ఆపరేషన్లు చేస్తున్నట్టు తెలిపారు. తద్వారా రక్తస్రావం కూడా తక్కువ మోతాదులో ఉంటుందన్నారు. ఒక్కరోజులోనే డిశ్చార్జ్ సాధ్యమని పైగా త్వరితగతిన సర్జరీ గాయాలు నయం అవుతాయన్నారు.

## పిల్లిని రక్షించిన అగ్నిమాపక సిబ్బంది



చెట్టుపై చిక్కుకున్న పిల్లి

చింతామణి, జూలై 27 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బెంగళూరు డబుల్ రోడ్డు కేఎస్ఆర్టీసీ వసతి గృహాల సమీపాన సుమారు 50 అడుగుల ఎత్తైన సిల్వర్ హండ్ చెట్టుపై రెండురోజులుగా పిల్లి అక్కడే ఉండి కిందకు రాలేక చిక్కుకుంది. కేఎస్ఆర్టీసీ సిబ్బంది అంబరీశ్ వెంటనే అగ్నిమాపక శాఖకు సమాచారం అందించారు. ఫైర్ ఆఫీసర్ లోకేశ్, సిబ్బంది అక్కడికి చేరుకుని పిల్లిని సురక్షితంగా రక్షించారు. అగ్నిమాపక సిబ్బంది కార్యవైఖరిని స్థానికులు ప్రశంసించారు.

## కంటి వైద్యంలో సాంకేతిక విధానాలు పాటించాలి




సదస్సులో పాల్గొన్న వైద్య ప్రముఖులు

బెంగళూరు, జూలై 27 (ఆంధ్రజ్యోతి): కంటి వైద్యంలో సాంకేతిక విధానాలు పాటించాలని బెంగళూరు ఆప్తమాలజీ సొసైటీ అధ్యక్షులు ఎలెన్ కుమారన్ అభిప్రాయపడ్డారు. బెంగళూరు అప్తమాలిక్ సొసైటీ ఆధ్వర్యంలో తొలిసారి జాతీయస్థాయి రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. రెండు రోజుల పాటు జరిగిన సదస్సులో ఐ స్పెషలిస్ట్ ప్రొఫెసర్ నమ్రతా శర్మ, ఆలిండియా మెడికల్ సైన్స్ నేత్రవైద్య నిపుణులు రాజేంద్రప్రసాద్‌తోపాటు రాష్ట్ర వ్యాప్తంగా నేత్రవైద్యులు భాగస్వామ్యులయ్యారు.

### జూదరుల అరెస్ట్

హిందూపురం, జూలై 27(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆర్టీసీ బస్టాండు ముందున్న సప్తగిరి లాడ్జిలో పేకాట ఆడుతుండగా పోలీసులు మెరుపుదాడిచేసి 24మంది జూదరులను అరెస్ట్‌చేసినట్లు వన్‌టౌన్ సీఐ రాజగోపాల్‌నాయుడు తెలిపారు. శనివారం అర్ధరాత్రి సమయంలో పేకాట ఆడుతున్నట్లు సమాచారం రావడంతో సీఐలు ఆంజనేయులు, జనార్దన్, అబ్దుల్ కరీం దాడి చేయడం జరిగిందన్నారు. రెండు రూముల్లో పేకాట ఆడు తుండగా 24మందిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి పది ద్వి చక్రవాహనాలు, రూ.51వేలు నగదు, సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు వి వరించారు. అయితే ఈలాడ్జి అధికార పార్టీకి చెందిన నాయకుడిది కావడం విశేషం.

## క్రీడాకారులకు తోడ్పాటు: యూటీఎఫ్

పెనుకొండ రూరల్, జూలై 27(ఆంధ్రజ్యోతి): పెనుకొండ డివిజన్‌లో క్రీడాకారులకు యూటీఎఫ్ ఎంతో తోడ్పాటును అందిస్తోందని నాయకుడు కేజీ రామాంజినేయులు అన్నారు. రిటైర్డ్ పీఎస్ హెచ్‌ఎం జ్ఞాపకార్థం జిల్లాస్థాయి టీచర్స్ క్రికెట్ టోర్నీ పెనుకొండ పట్టణంలో ఆదివారం ప్రారంభమైంది.